మాట తీరు బాగుండాలి - నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మాటే మంత్రం అన్నారు విజ్ఞులు. మంత్రం అంటే వేదమంత్రమే కావాల్సిన పని లేదు. ఎదుటివారిని మంత్రముగ్ధుల్ని చేసే ఏ మాటైనా మంత్రమే. మంచి మనసుతో, చక్కని భావంతో పలికే మాటలు మంత్రాల్లా ఎదుటివారి మీద ప్రభావం చూపించి కట్టిపడేస్తాయి. మన వ్యక్తిత్వాన్ని తెలిపేవి మాటలే. మన మెలాంటివారమో ఎదుటివారికి చెబుతాయి. తియ్యని కంఠంతో మృదుమధురంగా మాట్లాడితే ఎదుటివారు ఆగి వినాల్సిందే తప్ప అడుగెయ్యకూడదన్నట్టు మాట్లాడాలి. నోటి నుండి మాట బయటకు వచ్చే లోపు మనసులో సంకల్పించి , బుద్ధితో ఆలోచించి మాట్లాడటం అలవర్చుకోవాలి.అప్పుడా మాటలన్నీ మంత్ర సమానమే కదా.

ఎదుటివాళ్ల మాటలు విన్నప్పుడు సున్నితంగా స్పందించడం అవసరం. వాళ్ల మాటలను వింటూ విలువిచ్చినప్పుడు, మన పట్ల వాళ్లకీ ఆదర భావం పెరుగుతుంది. మన మాటలు ఇతరులు వినాలని మనం కోరుకున్నట్టే అవతలివాళ్ల మాటలు మనం వినాలని ఆశించడంలో తప్పు లేదు కదా. కాబట్టి ఎదుటివారు చెప్పేటప్పుడు దిక్కులు చూడకుండా, అశ్రద్ధ చేయకుండా శ్రద్ధగా ఆలకించడమూ అవసరమే కాదు తప్పనిసరి.

'నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందని' సామెత. మాట తీరు బాగుంటే అందరూ మనకు దగ్గరవుతారన్నది జగమెరిగిన సత్యం. మాట్లాడడం బాగా తెలిసినవాడు ఎంతటి వారినైనా తన మాటకారితనంతో ఆకట్టుకుంటాడు. చుట్టూ ఉన్నవాళ్లతో కానీ , కొత్త వాళ్లతో కానీ సంతోషకరమైన సంబంధాలు కొనసాగించాలంటే చక్కటి మాటతీరు అవసరం. అప్పగించిన పని ఏదైనా సరే సులువుగా , తొందరగా సాధించే అవకాశం దక్కుతుంది.

మధురంగా మాట్లాడడం ఒక కళ. అలా మాట్లాడడం ఒక అదనపు అలంకారం. సందర్భోచితంగా ఎదుటివారి మనసు గాయపడకుండా మాట్లాడడం గొప్పవారి లక్షణం. అందుకే లోకంలో చక్కగా మాట్లాడేవారిని ప్రజలు మెచ్చుకుంటారు. మేలు కలిగించే మాటలైనప్పటికీ.. కఠోరంగా మాట్లాడితే వినడానికెవరూ ఇష్టపడరు. కఠినంగా మాట్లాడేవారికి మనుషులు దూరమవుతారు. అది వారికి నష్టం కలిగించడమే కదా. అలాంటివారు తలపెట్టిన పనులు సవ్యంగా జరగకపోగా ఇబ్బందులు, అవమానాలు తలెత్తవచ్చు.

మంత్రాలు, శ్లోకాలను పఠించి దేవతలను మెప్పించి వరాలు పొందొచ్చని , రాజుల ఘనతను, వీరత్వాన్ని ప్రశంసించి భూరి విరాళాలు స్వీకరించవచ్చని, మధురమైన మాటలతో స్త్రీల మనసులు గెలవవచ్చని, వినయంగా, మధురంగా మాట్లాడడం రాకపోతే అవమానం కలుగుతుందని లోకవాక్కు.

నిజమే. మాట సరస్వతీ మాత వరం. మరే జీవికీ లేని, కేవలం మానవులకే లభించిన వరం. పెట్టని ఆభరణం. మన మాటలు కోయిల గానంలా శ్రోతలను అలరించి, రంజింపజేయాలి.తడబాటు లేకుండా, విషయాన్ని సూటిగా, స్పష్టంగా, ఎదుటి వారికి నచ్చని విషయమైనా వారు నొచ్చుకోకుండా ఉండేలా చెప్పడానికి మనిషిలో ఎంతో చతురత, అంతకు మించి సమయస్ఫూర్తి ఉండాలి. దీనికి ఉదాహరణగా రామాయణంలో హనుమంతుని వర్ణిస్తారు. మొదటిసారి శ్రీరాముని కలిసినప్పుడు హనుమ సంభాషించిన తీరుని ఎన్నో సందర్భాల్లో ఉదాహరిస్తారు కవులు. ఎదుటివారిని మెప్పించేలా మాట్లాడటం, తమకు తెలియని చోటుకు వెళ్లి అక్కడి నుండి క్షేమంగా తిరిగి రావడం, కార్యసాధనలో విజయం పొందడం వంటి వాటిలో హనుమకు సహాయపడింది ఆయన మాటతీరే. అందుకే మాట తీరు ముఖ్యమని పెద్దలు చెబుతారు.

ఎదుటివాళ్లు మన మాట తీరుని బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు. వ్యక్తిత్వం అనేది మనిషికి చాలా ముఖ్యం. మాట తీరుపైనే మన ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. మాట తీరు మనలోని సభ్యతను, సంస్కారాన్ని బయటపెడతుంది.

ఒక మనిషిని అంచనా వేయడానికి అతని రూపురేఖలో, రంగుహంగులో కొలమానం కాదు. అందగాళ్లంతా గొప్పవాళ్లు కాకపోవచ్చు. కురూపులలోనూ మహాత్ములు ఉండవచ్చు. కాబట్టే, 'నీ స్నానాలు, లేపనాలు, ఆభరణాలు.. ఇవేవీ అసలైన అలంకారాలు కాదు. మంచి వాక్కు, గొప్ప వ్యక్తిత్వమే సిసలైన ముస్తాబు' అంటారు సుభాషిత కర్త.

భూరి గుణోన్నతులనఁదగు

వారికి, ధీరులకు, ధరణి వల్లభులకు వా

క్పారుష్యము చన్నె? మహా

దారుణమది విషము కంటె దహనము కంటెన్!!

రాజసూయ యాగ సమయంలో శ్రీకృష్ణుని నిందిస్తున్న శిశుపాలునికి ధర్మరాజు చేసిన హిత బోధ ఇది. ''శిశుపాలా! గొప్ప గుణములచేత ఉన్నతులైన వారికి, ధీరులకు, రాజులకు కఠినంగా మాట్లాడడం తగునా? కఠినమైన మాటలు, విషం కంటే, అగ్ని కంటే కూడా దారుణమైనవి" అని పలికాడు ధర్మరాజు. అదేపనిగా శ్రీకృష్ణుడిని పరుష వాక్కులతో దూషించిన శిశుపాలుడికి ఏ గతి పట్టిందో మహాభారతం తెలిపింది. కఠినమైన వాక్కులు, దూషణలు ఎప్పుడూ మేలు చెయ్యవు. సరికదా కష్టాలని, ఆపదల్ని వెంట తెస్తాయి.

మాటల్లో అనేక రకాలున్నప్పటికీ సాంత్వన చేకూర్చే ఓదార్పు మాటలు, సానుకూల దృక్పథాన్ని పెంచే అనునయపూర్వక మాటలు, శాంతియుతమైన మాటలు మంత్రాల్లా పనిచేసి ఎదుటివారిలో ఆశావహ దృక్పథాన్ని పెంచి జీవితాన్ని ఉత్సాహభరితం చేస్తాయి. చిరాకు, కోపం, ద్వేషం, నిరాశ నిండిన మాటలు శాపాల్లా వెంటాడి , ఎదుటివారిలో నైరాశ్యాన్ని పెంచుతాయి. మనసులో అశాంతి నింపుతాయి.

"నోరు జారిన మాట.. చేజారిన అవకాశం.. ఎగిరిపోయిన పక్షి.. గడిచిపోయిన కాలం.. తిరిగి లభించడం దుర్లభం" అని గ్రంథాలు బోధించాయి. అనగా ఒకసారి మాట్లాడిన మాట, వదులుకున్న అవకాశం, చెట్టు మీద నుండి ఎగిరిపోయిన పక్షి, గడిచిన కాలం ఎన్నటికీ తిరిగి రావని భావం. అది తెలుసుకుని ఏ విషయాన్నైనా ఆచితూచి మాట్లాడాలి. లేదంటే అనర్థాలకు దారి తీస్తుంది. ఎదుటివారిని ఇబ్బంది పెట్టేలా మాటలు ఉండకూడదు. మన మాటలు ఇతరులకు ఊరట నివ్వాలే తప్పా బాధను కలిగించకూడదు. ఎప్పుడైతే ఎదుటివాడికి మన మాటలు అమృతంలా అనిపిస్తాయో, పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు అవుతుంది. కాబట్టి మాట్లాడే ప్రతి మాట ఆచితూచి మాట్లాడాలి.

విల్లు నుండి దూసుకువెళ్లిన బాణం ఎదుటివాళ్లని గాయపరచినట్టే మాట్లాడే చెడ్డ మాట ఎదుటివాళ్ళ మనసుల్ని గాయపరుస్తుంది . శరీరానికి అయిన గాయం కొన్నాళ్ళకు నయం కావచ్చు. మనసుకి అయిన గాయం ఎప్పటికీ నయం కాదు. జీవితకాలం బాధపెడుతుంది. అందుకే ఎదుటివాళ్ళని బాధ పెట్టే మాటలు మాట్లాడే ముందు ఆలోచించాలి.

కొన్నిసార్లు ఎవరికైనా కోపం రావడం సహజం. అలాంటప్పుడు ఆవేశంలో నిర్ణయాలు తీసుకోకూడదు. ఎదుటివాళ్ళని ఉద్దేశించి కఠినమైన మాటలు అసలే మాట్లాడకూడదు. మౌనం వహించడమే ఉత్తమం. "మండుతున్న అగ్ని లాంటిది కోపం. దాన్ని చేత్తో పట్టుకుని విసరాలనుకోవడం అవివేకం. విసిరేలోపే పట్టుకున్నవాళ్ళని కాల్చేస్తుంది" అన్నది బుద్ధదేవుని వాక్యం. కోపంలో ఎదుటివాళ్ళని బాధపెట్టడమంటే ఆ వ్యక్తులను జీవితకాలం దూరం చేసుకున్నట్టేనని గుర్తుంచుకోవాలి .

జీవితం సజావుగా సాగాలంటే మాటతీరు మన్ననగా ఉండాలి. సమయోచితంగా మాట్లాడాలి. 'వాగ్భూషణం భూషణం' అన్నది భర్తృహరి సుభాషితం . అంటే వాక్కే అసలైన ఆభరణం అని భావం. మాటలే మన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తాయి.

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మి:

జిహ్వాగ్రే మిత్ర బాంధవా :

జిహ్వాగ్రే బంధన ప్రాప్తి :

జిహ్వాగ్రే మరణ ధృవం

మాట వైఖరి బాగుంటే బంధుమిత్రులు లభిస్తారు . సంపదలు ప్రాప్తిస్తాయి. జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చు . లేదంటే చిక్కుల్లో పడొచ్చు . సంపదలు కోల్పోవచ్చు. ప్రాణహాని కూడా సంభవించవచ్చు . కనుక మధురభాషణ అలవరచుకోవాలి. జీవితం బాగుండాలంటే మాటతీరు సరిగ్గా ఉండాలి.

మాటలు శక్తివంతమైన సాధనాలు. ఒక మాట మనిషికి ఆనందాన్ని ఇస్తుంది. మరో మాట బాధపెడుతుంది. తెలుగు సాహిత్యంలో శతకకారులు మాటల విలువను చెబుతూ అనేక పద్యాలు రాశారు. వేమన శతకం నుండి ఒక పద్యం పరిశీలిద్దాం.

వాక్కు వలన గలుగు వరమగు మోక్షంబు

వాక్కు వలన గలుగు వసుధ ఘనత

వాక్కు వలన గలుగు సెక్కుడైశ్వరముల్

విశ్వదాభిరామ వినురవేమ

పద్యం యొక్క భావం —- మాట తీరుని బట్టి గౌరవం కలుగుతుంది, ఐశ్వర్యం దక్కుతుంది, అందరి వద్ద మన్ననలు పొందుతాము. చివరకి మోక్షం కూడ లబిస్తుంది. కాబట్టి మాట్లాడే విధానం తెలుసుకోవడం ఎంతో ముఖ్యం.

ఇటీవల కాలంలో పిల్లలు ఎక్కువగా ఓటీటీలు, మొబైల్ కంటెంట్ చూస్తున్నారు. అంతర్జాల ప్రపంచంలో వారు ఏమేమి చూస్తున్నారో , ఏమి వింటున్నారో అవే వాళ్ళ మనో భావాలను , మాటలను ప్రభావితం చేస్తాయి. ప్రవర్తనను తీర్చిదిద్దుతాయి . చిన్నవయసులోనే పెద్దలకు తెలియాల్సిన అంశాలన్నీ తెలిసిపోతున్నాయి. వయసుకి మించిన పరిణతితో తయారవుతున్నారు . తమకే అంతా తెలుసనే ధోరణి పెరిగింది. పెద్దల పట్ల వినయ విధేయతలు, గురువుల పట్ల భక్తిశ్రద్ధలు క్షీణించడం కనబడుతోంది. పెద్దలను ఎదిరించి మాట్లాడడం, ఇంటికి సాయం కోసం వచ్చినవాళ్ళని , చుట్టరికం కోసం వచ్చిన వాళ్ళని చిన్నబుచ్చుతూ హేళనగా మాట్లాడడం అక్కడక్కడా జరుగుతోంది. అది మంచిది కాదు.తద్వారా పిల్లల తల్లిదండ్రులకు చెడ్డ పేరు వస్తుంది. వాళ్లకి తెలీకుండా జరగడం లేదనుకుంటారు ఎదుటి వారు . పిల్లల చేత పెద్దలే అలా మాట్లాడించారనే భావం కలుగుతుంది . ఆ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించి పిల్లలను అదుపుచేయాలి. ఏ సమయంలో , ఏ వయసులో ఏమేమి చెప్పాలో, ఎలా చెప్పాలో పెద్దలు ఆలోచించుకుని బాధ్యతగా నేర్పాలి. అందుకు బాలసాహిత్యంలో రాసిన కథలు, పద్యాలు , గేయాలు, సూక్తులున్న పుస్తకాలు సహాయపడతాయి. వీలున్నప్పుడల్లా పిల్లలతో మాట్లాడి మాటతీరు వల్ల కలిగే లాభాలు చెబుతూ వారిలో ప్రేరణ కలిగించాలి . మంచి పద్ధతులు నేర్పాలి. అప్పుడే ప్రయోజనం కలుగుతుంది.

ఇతరుల మెప్పు పొందే విధంగా మాటతీరు పెంచుకోవడానికి కొన్ని నియమాలు పాటిస్తే ఉపయోగం ఉంటుంది. అవేమిటో చూద్దాం. కఠినంగా మాట్లాడితే సమాధానం కూడా అదే రీతిలో వస్తుంది. ఆత్మీయత కలిగిన మాటలు స్నేహాలను బలపరుస్తాయన్న సంగతి గ్రహించి మాటతీరు మార్చుకోవాలి.

ఇతరుల మాటలను గౌరవంగా వింటే వారు కూడా మన మాటలను గౌరవిస్తారని గ్రహించి ఆచరించాలి. ఏ పదం ఎవర్ని ఎలా ప్రభావితం చేస్తుందో ముందుగా ఆలోచించడం అవసరం. "మాట అనేది విసిరిన బాణం లాంటిది; వెనక్కు తిప్పలేము" అనే మాట గుర్తుపెట్టుకోవాలి.

ఆవేశంతో మాట్లాడకుండా ప్రశాంతంగా మాట్లాడితే వివాదాలు, తగువులు దరిచేరవు. అదే సరైన తీరు అని తెలుసుకోవాలి.

పెద్దలకు గౌరవం ఇవ్వడం, చిన్న వారిని ప్రేమతో చూస్తే మన మాటలు మరింత మాధుర్యంగా మారతాయని గుర్తించి మెలగాలి.

కేవలం మాటతీరు వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు తెలిపే పద్యం ఒకటి చదువుదాం .

వాక్కు వలన గలుగు వంద బంధములును

వాక్కు వలనె గలుగు భారి తగవు

పలుకు నుండె వచ్చు పరమోషధముయును

బుద్ధి ధాత్రి దివ్య భారతాంబ!

దీని భావం —– తల్లీ భారతీ! మాట మాట్లాడటం వలననే ఎన్ని సత్సంబంధాలను అయినా పెంచుకోవచ్చు. మాట మాట్లాడటం వలన ఎంత పెద్ద యుద్ధమైనా జరగవచ్చు. ఎవరైనా బాధలో ఉన్నప్పుడు వారికి ధైర్యాన్నివ్వడానికి మనం మాట్లాడే మాట ఒక ఔషధంగా కూడా పని చేస్తుంది.

చక్కటి మాటతీరు ఉన్న వారికి అందరూ దగ్గరవుతారు. అనేక మందితో పరిచయం , స్నేహం బలపడుతుంది. మంచి సంభాషణ వల్ల ఇతరుల మనసు సులువుగా గెలుచుకోవచ్చు. ప్రశంసాకరమైన మాటల వల్ల ఆత్మవిశ్వాసం , మనోధైర్యం పెరుగుతాయి. విభేదాలు , వివాదాలు వచ్చినప్పుడు కూడా మంచి మాటలతో పరిష్కార మార్గాలు దొరుకుతాయి .

తమ మాటతీరు వల్లనే చాలామంది గొప్పవారయ్యారు. అలాంటి ప్రముఖుల జీవితాల నుండి కొన్ని సంఘటనలు తెలుసుకుందాం.

సత్యం పలకడం, అహింసా సిద్ధాంతాన్ని పాటించడం ద్వారా గాంధీజీ, నాటి పాలకులపై చక్కని ప్రభావం చూపారు. "సత్యం మరియు అహింస నా రెండు ఆయుధాలు" అని గాంధీజీ అన్న మాటలు భారతీయులను ఐక్యంగా నిలబెట్టాయి. దండి సత్యాగ్రహం సమయంలో ఆయన సలహాలు, మాట తీరు ప్రజల్ని భారీ స్థాయిలో ఆకర్షించింది.

స్వరాజ్య సాధనకు పూర్వం భారతీయులన్నా , భారత దేశమన్నా బానిసత్వంలో జీవిస్తున్న దేశస్తులని చులకన భావం ఉండేది విదేశీయులకు. ఆ భావాన్ని మరిపించడమే కాక గౌరవాన్ని తెచ్చిన భరతమాత ముద్దుబిడ్డ వివేకానందుడు. చికాగో నగరంలో జరిగిన మొదటి సర్వమత సమ్మేళనంలో భారతదేశ ప్రతినిధిగా వివేకానందుడు ప్రసంగించిన తరువాత భారతీయులన్నా, హిందూమతమన్నా విదేశీయులకు గౌరవం పెరిగింది. 1893 సెప్టెంబరు 11న చికాగోలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం సుప్రసిద్ధమైనదిగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. ప్రపంచవ్యాప్తంగా పలు మతాల ప్రతినిధులు ఆ సమ్మేళనంలో పాల్గొనగా స్వామి వివేకానందకు కేవలం పదినిముషాలు సమయం కేటాయించడం జరిగింది. కానీ ఆయన ప్రసంగం ప్రారంభిస్తూ మాట్లాడిన తీరు అక్కడి పరిస్థితులను ఏకంగా మార్చేసింది. అందరినీ ఆశ్చర్యానందాల్లో ముంచెత్తింది.

"ప్రియమైన అమెరికా సోదర సోదరీమణులారా (మై డియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా) అని సంబోధిస్తూ ప్రారంభించడంతోనే శ్రోతలను ఆకట్టుకున్నారు స్వామి వివేకానంద. సాధారణంగా లేడీస్ అండ్ జంటిల్మన్ అన్న సంబోధనకు అలవాటు పడ్డ సభికులను , కొత్త పిలుపులోని ఆత్మీయత ఆకర్షించింది. ఆయన సందేశానికి, వాక్పటిమకూ, నిజాయితీతో కూడిన మాటలకూ యావత్ప్రపంచం ఆశ్చర్యపోయి దాసోహమయ్యింది. ఆయన మాటతీరు ఆయనకు అంత పేరుప్రఖ్యాతులు తెచ్చింది.

మన దేశ పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సహజమైన మాటలతో ఎంతోమంది యువతను ప్రేరేపించారు. ఆయన మాటలు సాదాసీదా అయినప్పటికీ, లోతైన అర్థం, స్ఫూర్తి కలిగించేవిగా ఉండేవి. "స్పష్టమైన లక్ష్యాలు ఉండాలంటే కృషి చేయడం చాలా అవసరం" అని చెప్పిన ఆయన మాటలతో చాలా మంది విద్యార్థుల జీవితాలు మారాయి.

వాళ్ళే కాదు ప్రపంచ చరిత్రలో అనేక మంది రాజులు, నాయకులు, స్వాతంత్ర్య పోరాట యోధులు, కంపెనీల స్థాపకులు తమ మాటతీరు ద్వారా ఘనత సాధించారు. వారి మాటలు కేవలం సాధారణ పలుకుబడులు మాత్రమే కాకుండా, గొప్ప ఆలోచనలు, మార్పు మరియు ప్రేరణకు కారణం అయ్యాయి. శక్తివంతమైన వారి మాటలు సమాజాన్ని ప్రభావితం చేసి, విజయాన్ని అందించాయి.

చివరగా మనం తెలుసుకోవాల్సిన దేమిటంటే మాటలే మన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తాయి. మాటల్ని ఎంతో అర్థవంతంగాను గుణాత్మకంగాను ఉపయోగించాలి. మాట అనేది మానవ సంబంధాలలో అత్యద్భుతమైన విజయాలను అందిస్తుంది. స్నేహం పెరుగుతుంది. ఎవరితోను వైరం ఉండదు. మన మాట-మన వ్యక్తిత్వం ముందు దేవాలయంలోని ధ్వజస్తంభం మాదిరి సమున్నతంగా నిలబడాలి. అప్పుడే బంధాలన్నీ బలంగా ముడిపడతాయి.

———@@@@——